అసిస్టెంట్ ప్రొ.విజయలక్ష్మికి గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు


గ్లోబల్ పీస్ అవార్డును అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయలక్ష్మి

బర్కత్‌పుర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పురలోని రెడ్డి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.విజయలక్ష్మికి మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 ప్రదానం చేశారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, సుప్రీంకోర్టు న్యాయవాది డి.ఎల్.పాండు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్, ప్రొఫెసర్ జి.సుదర్శన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జె.అచ్యుతదేవి, ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, డాక్టర్ జీవనజ్యోతి తదితరులు విజయలక్ష్మిని అభినందించారు.

31లోపు ఆస్తి పన్ను చెల్లించండి

- అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు
- అంబర్‌పేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్

ఇంటర్వ్యూ



రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని భవనాల యజమానులు ఈనెల 31వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించి 2 శాతం వడ్డీ మినహాయింపు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ సూచించారు. గడువులోపు పన్ను చెల్లించని వారు 2 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అంబర్‌పేట సర్కిల్ పరిధిలో మొత్తం 68,189 భవనాలు ఉన్నారని తెలిపారు. సర్కిల్‌లో 153 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 36.34 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ 'ఆంధ్రజ్యోతి'తో పలు పలు విషయాలు చర్చించారు.

అడ్వాన్స్ టాక్స్ చెల్లింపుపై ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటి.

అడ్వాన్స్ టాక్స్ చెల్లించే వారికి 2 శాతం వడ్డీ మాఫీని ప్రభుత్వం కల్పించింది. ప్రతీ సంవత్సరం అడ్వాన్స్ చెల్లింపులు ఏప్రిల్ 1 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు ఉంటుంది. ఆ తర్వాత చెల్లించే వారు 2 శాతం వడ్డీతో చెల్లించాల్సి ఉంటుంది. అడ్వాన్స్ టాక్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి డివిజన్‌లో బిల్‌కలెక్టర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. దీనివల్లే 40 శాతం టార్గెట్‌ను చేరుకున్నాం.

నివాస గృహాలకు అనుమతులు పొంది కమర్షియల్ కార్యకలాపాలు సాగిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

సర్కిల్ పరిధిలో ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో కొంత మంది గృహ నిర్మాణాలకు అనుమతి పొంది కమర్షియల్ వ్యాపారాలు నిర్వహిస్తూ జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. అటువంటివి గుర్తించి ఆస్తి పన్ను పెంచేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. ప్రభుత్వ గెజిట్ ప్రకారం ఆయా ప్రాంతాలను బట్టి ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం కమర్షియల్ టాక్స్ విధించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇంటింటికీ వచ్చే జీహెచ్‌ఎంసీ టాక్స్ అధికారులకు ప్రజలు సహకరించి ఆస్తి పన్ను చెల్లించాలి. లేనిపక్షంలో ఆ భవనాలను సీజ్ చేస్తాం.

సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై తీసుకుంటున్న చర్యలేమిటి.

నూతనంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారు జీహెచ్‌ఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మిస్తే వాటిని కూల్చివేస్తాం. అనుమతుల ప్రకారం నిబంధనల మేరకు సెట్‌బ్యాక్ వదిలి నిర్మాణాలు చేసుకోవాలి

జీహెచ్‌ఎంసీ అధికారుల పేరుతో కొంత మంది నిర్మాణదారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకుని నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేసుకునే వారు ఎవరికీ భయపడొద్దు. జీహెచ్‌ఎంసీ అధికారుల పేరు చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దు. అలాంటి సమస్య వస్తే తమకు ఫిర్యాదు చేయాలి. అలాంటి వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చట్టపరంగా వారిపై చర్యలు చేపడతాం.

ఆర్థిక సాయం



లండన్‌లోని ఇంగ్లిష్ చానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళ బర్కత్‌పురకు చెందిన గంధం క్వీన్ విక్టోరియాకు మహంకాళి సీఐ కే పరశురాం రూ.20 వేల నగదును శుక్రవారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలోని ఏడు దానళ్లను ఈదేందుకు పోలీస్ అధికారులు స్పందించి సాయం అందిస్తున్నారని చెప్పారు. తనకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్న ఇద్దరు వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

– బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

భక్తి గీతాలాపన, నృత్య కళాకారుల ప్రదర్శన


శ్రీకీర్తన సంగీత అకాడమి వేడుకల్లో నృత్య కళాకారులు

రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకీర్తన సంగీత అకాడమి వార్షిక వేడుకలు శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిగిరి జశివదాస్ హాజరయ్యారు. శ్రీకీర్తన సంగీత అకాడమి గురువు సుష్మవేదగిరి శిష్యబృందం వివిధ భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గిరి జాశివదాస్ మాట్లాడుతూ.. పిల్లల సామాజిక పెరుగుదలకు సంగీతం వంటి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో 40 మంది నృత్య కళాకారులు పాల్గొని అన్నమయ్య, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో అకాడమి వ్యవస్థాపలకు సుష్మవేదగిరి, విజయచంద్ర, కళాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్రపూర్ణచంద్ర దర్శనోత్సవ అభినందన


విజయలక్ష్మిని సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సాహితీ జిగీష వ్యవస్థాపకులు, సాహితీవేత్త డా. పులిగడ్డ విజయలక్ష్మి సహస్ర పూర్ణ చంద్ర దర్శనోత్సవం అభినందన సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాహితీజిగీష ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని విజయలక్ష్మిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాహితీ జిగీష సంస్థ నిర్వహించే ప్రతీ కార్యక్రమం విలక్షణంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, బండారుపల్లి రామచంద్రరావు, లలితవాణి, రఘుశ్రీ, దత్తాత్రేయశర్మ, పతంజలి, ఉమాశశి తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి


రాజాకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్, గుజ్జ కృష్ణ తదితరులు

రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేపట్టే అంశంపై కేంద్రంపై ఒత్తిడి తేవాలని సీపీఐ జాతీయ నాయకుడు రాజాకు శుక్రవారం మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 26న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, జోషి రాఘవ, మోదీ రాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో మైలిటిస్‌తో కలిగే ముప్పును గుర్తించాలి

చిక్కడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలియో మైలిటిస్ కారణంగా కలిగే ముప్పును గుర్తించడం చాలా అవసరమని కిడ్స్ క్లినిక్ పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డా.శ్రీనివాస్ కల్యాణి అన్నారు. పోలియో అంటువ్యాధి అని, ఐదేళ్లలోపు పిల్లలను ప్రభావితం చేస్తుందన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలియో నిర్మూలన- కమ్యూనిటీ నేతృత్వంలో సాధించిన విజయం అంశంపై ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు.

నిజాం కాలం నుంచే.. సదర్ ఉత్సవాలు

- ఆకట్టుకోనున్న దున్నపోతుల విన్యాసాలు
- ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో వేడుకలు


దున్నపోతుతో యాదవ సంఘం నేత నందకిషోర్‌యాదవ్ (ఫైల్)

బర్కత్‌పుర అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినం వచ్చిందంటే యాదవుల ఆనందానికి అవధులు ఉండవు. నగరానికే తలమానికంగా నిలిచిన సదర్ సమ్మేళనాన్ని దీపావళి పండుగ అంత వైభవంగా నిర్వహిస్తారు. స్వాతంత్ర్యానికి ముందే సదరు ఉత్సవాలకు నగరం వేదికయింది. యాదవ కులస్థులు నిజాం పాలనలోనే సదర్ ఉత్సవాలను వైభవంగా జరుపుకునేవారు. వ్యవసాయ రంగంతో ముడిపడి ఉన్న సదర్ ఉత్సవాలను యాదవులు ప్రతీ సంవత్సరం దీపావళి నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. యాదవులు దున్నపోతులను పవిత్రంగా చూడడం ఈ సదర్ సమ్మేళనంలో కనిపిస్తుంది.

సదర్ అనగా కులపెద్ద. వీరినే చౌదరి అని కూడా పిలుస్తుంటారు. నిజాం హయాంలో యాదవులు జరుపుకునే ఉత్సవాలకు సదర్ సమ్మేళనం అని నామకరణం చేశారు. ఆనాటి నుంచే ఈ ఉత్సవాలు జరుపుకోవడం యాదవ కులస్థులకు ఆనవాయితీగా వస్తోంది. నిజాం హయాంలో నగరంలోని రాంకోఠి, నారాయణగూడ, కాచిగూడ ప్రాంతాలకు చౌదరీలను నియమించారు. ప్రతీ సంవత్సరం చౌదరీల సమక్షంలో సదర్ సమ్మేళనాలు నిర్వహిస్తారు.

నిజాం హయాంలోనే..

ఏడో నిజాం మీర్‌ఉస్మాన్ అలీఖాన్ హయాంలో నగరంలో మలక్‌పేట, చంచల్‌గూడ ప్రాంతాల్లో దీపావళి సందర్భంగా సదర్ వేడుకలు నిర్వహించారు. దీనిలో బాగంగా దున్నపోతులను అందంగా అలంకరించి విన్యాసాలు చేయించడంతో పాటు పూజలు నిర్వహించేవారు. 1946లో నారాయణగూడలోని దీపక్ థియేటర్ ఎదురుగా మొదటిసారి నిర్వహించిన ఈ సదర్ వేడుకల్లో నిజాం రాజు, ఆయన ఆస్థాన మంత్రులు, చౌదరీలు పాల్గొన్నారు. అప్పటి చౌదరి నాయం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలకు అంకుర్పారణ జరిగింది. 1967 నుంచి ఈ వేడుకలను నారాయణగూడ వైఎంసీఏకు మార్చారు. నాటి నుంచి నేటి వరకూ అక్కడే వేడుకలు నిర్వహిస్తున్నారు.

27న ఎన్టీఆర్ స్టేడియంలో..

ఈనెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలు నిర్వహించనున్నారు. 31న నింబోలిఅడ్డ, కొత్తపేట, నార్సింగి, రామంతాపూర్, నవంబర్ 1న ఖైరతాబాద్, సైదాబాద్, కార్వాన్, ఆసిఫ్‌నగర్, అమీర్‌పేట, బోయిన్‌పల్లి, నల్లగుట్ట, బొల్లారం, మచ్చబొల్లారం, బజార్‌ఘాట్, గుడ్డిమల్కాపూర్, నవంబర్ 2న నారాయణగూడ వైఎంసీఏ వద్ద నిర్వహించే సదర్ సమ్మేళనం చివరి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఈ సమ్మేళనంలో నగరం నలుమూలల నుంచి యాదవ కులస్థులు కుటుంబసమేతంగా సాంప్రదాయ దుస్తులు దరించి వచ్చి దున్నపోతుల విన్యాసాలను తిలకిస్తారు. దున్నపోతులను అందంగా ముస్తాబు చేస్తారు. ఆ తర్వాత శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించి బంధువులు, అక్కాచెల్లెళ్ల ఇళ్లకు అలంకరించిన దున్నపోతులను మంగళవాయిద్యాలతో తీసుకువెళ్తారు. ఈ సందర్భంగా కర్రసాము చేయడం, దున్నపోతులతో నృత్యాలు చేయించడం ప్రత్యేకం.

తరలిరానున్న ప్రముఖులు

ఎన్టీఆర్ స్టేడియం, నారాయణగూడ వైఎంసీఏ వద్ద నిర్వహించే ఈ వేడుకల ప్రారంబోత్సవ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మాజీ మం త్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సి.కృష్ణయాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్ తోపాటు ప్రముఖులు పాల్గొననున్నారు.

● ఆస్తిపన్ను చెక్కు అందజేత



అంబర్‌పేట సర్కిల్ డీఎంసీ మారుతీ దివాకర్‌కు హిమాయత్‌నగర్‌లోని ఓ సంస్థ నుంచి 8 లక్షల రూపాయల ఆస్తి పన్ను చెక్కును అందజేస్తున్న టాక్స్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఏఎంసీ రవీందర్ తదితరులు.

– రాంనగర్, ఆంధ్రజ్యోతి

శాస్త్రీయ పంటల బీమాతో రైతుకు మేలు

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ ఆర్.రామ్‌కుమార్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.అమర్‌నాథ్‌ప్రసాద్, ప్రొ.రామ్‌కుమార్

రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతు ఆదాయంలో వచ్చే ఒడిదుదుకులను తట్టుకునేందుకు శాస్త్రీయ పంటల బీమా సహాయ పడుతుందని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ ఆర్.రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చైతన్య సేద్యం మాసపత్రిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 'ప్రతికూల వాతావరణ మార్పులు, రైతు, పంటల బీమా అవసరాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు రాసిన ప్రతికూల వాతావరణ మార్పులు, రైతుల దుస్థితి, నివారణ పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. దేశంలో పంటల బీమా పథకం రైతుల ఆదరణ పొందలేదని, దీనికి కారణం పథకంలోని లోపాలే కారణమన్నారు. అధిక ప్రీమియం, రైతులకు అవగాహన కల్పించకపోవడమే కారణమన్నారు. దేశంలో 19.53 కోట్ల హెక్టార్లలో భూమి సాగులో ఉండగా కేవలం 4.28 కోట్ల హెక్టార్ల భూమి బీమా పరిధిలో ఉందన్నారు. ఉమ్మడి ఏపీ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాదీశ్వరరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో నష్టపరిహారం అంచనా కోసం ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ ఈనెల 26 నుంచి నవంబరు 10 వరకు రైతుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మాకర్‌రావు, సారంపల్లి మల్లారెడ్డి, సుదర్శన్‌రావు, నర్సింహారెడ్డి, జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా లక్ష్మీకాంత్ సునీల్


నియామక పత్రం అందుకుంటున్న సునీల్

కవాడిగూడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా కవాడిగూడకు చెందిన చెలిమల్ల లక్ష్మీకాంత్ సునీల్ నియమితులయ్యారు. ఈమేరకు సునీల్ నియామకాన్ని ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ శుక్రవారం ప్రకటించి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు తప్పకుండా వస్తాయని సూచించారు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం సునీల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎంపీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, సీనియర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

హౌసింగ్ సొసైటీ సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ

భాగ్యనగర్ టీఎన్జీవోఎస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్


మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణగౌడ్

బర్కత్‌పుర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ ఉపసంఘం ద్వారా హౌసింగ్ సొసైటీ సమస్యలు పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని భాగ్యనగర్ టీఎన్జీవోఎస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణగౌడ్ అన్నారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్ ప్రభుత్వం సొసైటీకి కేటాయించిన ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, సెక్రటరీ జనరల్ శ్రీనివాస్‌తో కూడిన ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డితో ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారని ఆయన తెలిపారు. భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ విషయంపై సీఎంతో చర్చించడం జరిగిందన్నారు. నవంబర్ 6న ఆర్టీసీ కల్యాణ మండపంలో సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, అమరజ్యోతి, సంధ్య పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ సాయం



అంబర్‌పేటకు చెందిన బి.నవీన్‌కు కిడ్నీ సమస్యతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.36 వేల చెక్కును గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లోని తన కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ నవీన్ కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో శివరామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

– గోల్నాక, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

బర్కత్‌పుర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కాచిగూడ ఆర్టీసీ జీఎం టి.రము అన్నారు. శుక్రవారం కాచిగూడ డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లు, కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. వీరితో పాటు మెకానిక్‌లు కూడా బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుమతులు పొందిన వారిని మిగతా సిబ్బంది ఆదర్శంగా తీసుకుని సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ వాసవీ, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించిన కాంగ్రెస్ నేతలు


ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న ఎస్తేర్‌రాణి తదితరులు

చిక్కడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న బి.రాజునాయక్‌ను రాష్ట్ర మహిళాకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎస్తేర్‌రాణి శుక్రవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్‌హెచ్‌వోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినీల్ రాహుల్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి చెత్త రిక్షాల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు చెత్త రిక్షాలను పంపిణీ చేసిన కార్పొరేటర్ యాకర అమృత, వనం రమేష్ తదితరులు

నల్లకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు 10 చెత్త రిక్షాలను కార్పొరేటర్ యాకర అమృత శుక్రవారం పంపిణీ చేశారు. డివిజన్‌లోని శంకర మఠం నుంచి శివం రోడ్ వెళ్లే విద్యానగర్ రైల్వే ట్రాక్ వద్ద మాజీ కార్పొరేటర్ వనం రమేష్, శానిటేషన్ సూపర్‌వైజర్ తిరుపతి నాయక్‌తో కలిసి కార్పొరేటర్ మాట్లాడారు. నల్లకుంటను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజలు ఇంటింటికీ వచ్చే చెత్త రిక్షాల్లో మాత్రమే చెత్త వేయాలని కోరారు. బీజేపీ నాయకులు లక్ష్మణ్, శివ, వెంకటేష్‌గౌడ్, సత్యనారాయణ, హిమగిరి గౌడ్, నర్సింహ, జానకి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకులు కేశపురం అరుణ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రాంనగర్ చౌరస్తాలో నిర్వహించిన బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ముఠా జైసింహ. – రాంనగర్, ఆంధ్రజ్యోతి

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

బర్కత్‌పుర: నేరాలను అదుపులో సీసీ కెమెరాలు దోహదపడతాయని హిందూ శ్మశాన వాటిక ప్రబంధక్ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం నింబోలిఅడ్డలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో 5 లక్షల రూపాయలతో హిందూ శ్మశానవాటికలో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

28 నుంచి ఎన్టీఆర్ స్టేడియంలో హాకా టపాకాయల విక్రయాలు

బర్కత్‌పుర, అక్టోబర్25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా) ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు దీపావళి సందర్భంగా టపాకాయల విక్రయాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎండీ కె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బషీర్‌బాగ్‌లోని హాకా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. స్టాండర్డ్ కంపెనీకి చెందిన టపాకాయలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. 48 సంవత్సరాలుగా హాకా ఆధ్వర్యంలో టపాకాయల విక్రయాలు కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

బాణాసంచా షాపుల వారు నిబంధనలు పాటించాలి

చిక్కడపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాణాసంచా షాపుల వారు నిబంధనలు పాటించాలని చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. బాణాసంచా షాపుల వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తప్పవన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి: హైదరాబాద్ సిటీ-1 పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. దోమలగూడ, అరవై మఠ్ పరిధిలోని మార్కెట్, జేబీ అపార్ట్‌మెంట్, అరవింద్‌నగర్, బ్రదుకా కాలేజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12, అంబేద్కర్‌నగర్ పరిధిలోని ఇందిరాపార్కు, అశోక్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీస్, బీమామైదాన్, వాంబేకాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటలు, ఎర్రమంజిల్ పరిధిలో 1.30 నుంచి 3 గంగల వరకు విద్యుత్ ఉండదన్నారు.

29న ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల జేఏసీ మహాధర్నా

చిక్కడపల్లి: ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎదుట 29న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ల జేఏసీ ప్రధానకార్యదర్శి రవిశంకర్ అల్లూరి తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయం తిలక్‌భవన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల29 ఉదయం 10 గంటలకు జరిగే మహాధర్నాలో ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికులు పెద్దఎత్తున పాల్గొని ఆందోళనను జయప్రదం చేయాలని కోరారు. తమ 20 డిమాండ్ల సాధన కోసం మహాధర్నా చేస్తున్నట్లు రవిశంకర్ వివరించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


రవిచారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఆర్‌టీకాలనీవాసులు

రాంనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని ఎస్ఆర్‌టీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ కె.రవిచారి తెలిపారు. ఎస్ఆర్‌టీ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ఎస్ఆర్‌టీ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయరావు, మధులు శుక్రవారం కార్పొరేటర్‌ను వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని కమలానెహ్రూ నగర్‌లో ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన దుర్గామాత ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానికంగా ఉన్న బద్దిపోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలకు అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు టెంట్‌హౌస్ శ్రీనివాస్, నాయకులు డి. శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, బీమర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.